వేలేరు గురుకులంలో భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ పీ ప్రావీణ్య

వేలేరు గురుకులాన్ని సందర్శించిన కలెక్టర్

వేలేరు, జూలై 9 : వేలేరు మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలను హనుమకొండ కలెక్టర్ పీ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ రాధిక గుప్తా మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల సమస్యలపై ఆరా తీశారు. పాఠశాలలో వండిన ఆహారాన్ని, వంటకాలను పరిశీలించారు. డ్రైనేజీ సమస్యలు, టాయిలెట్స్‌ను పరిశీలించి పునరుద్ధరణకు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీ, సొసైటీల నుంచి మంజూరైన నిధులతో చేపట్టిన పనులు రెండు వారాల్లో పూర్తి కావాలని ఆదేశించారు. అనంతరం వనమహోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్క నాటి నీరు పోశారు. అలాగే, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, సిబ్బంది రిజిష్టర్‌ను పరిశీలించారు. రోగులతో మాట్లాడి, సమస్యలను తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ హెచ్ కొమి, ఎంపీడీవో లక్ష్మీప్రసన్న, ఎంపీవో విమల, ఎంఈవో వెంకటేశ్వర్లు, డీఈలు, ఏఈలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం పరిశీలన

ధర్మసాగర్ : ఎలుకుర్తి గ్రామంలోని కుట్టు శిక్షణ కేంద్రాన్ని కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. గ్రామంలోని శక్తి మహిళా కుట్టు శిక్షణ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్స్ కుడుతున్నారు. కేంద్రంలో ఇప్పటి వరకు ఎన్ని డ్రెస్‌లు కుట్టారనే వివరాలు వారిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు ఉంటే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట అదనపు డీఆర్‌డీవో శ్రీనివాసరావు, ఇన్‌చార్జి డీఈవో చలపతిరావు ఉన్నారు.

వనమహోత్సవానికి ప్రాధాన్యమివ్వాలి

హనుమకొండ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వనమహోత్సవం కార్యక్రమానికి మొదటి ప్రాధాన్యమివ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ శాంతికుమారి సూచించారు. వనమహోత్సవం, ప్రజాపాలనా సహాయ కేంద్రాలు, మహిళా శక్తి, సీజనల్ వ్యాధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులతో పాటు, ధరణి దరఖాస్తులు, ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ, ఉద్యోగుల సాధారణ బదిలీలు తదితర అంశాలపై మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, వెంకట్‌రెడ్డి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, డీఆర్‌వో గణేశ్, జడ్పీ సీఈవో విద్యాలత, డీఆర్డీవో నాగ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న మేయర్, ఈఎన్‌సీ, కమిషనర్

నాలాల విస్తరణకు డీపీఆర్ రూపొందించాలి

- మేయర్ గుండు సుధారాణి
- ముంపు ప్రాంతాల పరిశీలన

వరంగల్, జూలై 9 : గ్రేటర్‌లో వరద ముంపును ఎదుర్కొనేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని మేయర్ గుండు సుధారాణి అన్నారు. మంగళవారం ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ జియాఉద్దీన్, గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి గ్రేటర్‌లోని ముంపు ప్రాంతాల్లో మేయర్ పర్యటించారు. వడ్డేపల్లి బండ్, జవహర్ కాలనీ, అంబేద్కర్‌భవన్, హనుమకొండ బస్‌స్టేషన్, ములుగురోడ్డు, ప్రభుత్వ ఐటీఐ, కొత్తవాడ, కాశీబుగ్గ, పద్మనగర్‌లో పర్యటించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఎదుర్కొంటున్న సమస్యలను ఈఎన్‌సీకి మేయర్ వివరించారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ జియాఉద్దీన్ మాట్లాడుతూ వరద నీరు సాఫీగా వెళ్లేందుకు నాలాలు ఎంత విస్తీర్ణం ఉండాలో డిజైన్ చేసి డీపీఆర్ పంపించాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన రహదారులు, హనుమకొండ బస్‌స్టేషన్, అంబేద్కర్ భవన్, ములుగు రోడ్, పోచమ్మమైదాన్ ప్రాంతాల్లో నూతన సాంకేతికతను వినియోగించి నీటి సంపుల నిర్మాణం చేసేందుకు యుద్ధప్రాతిపదికన అంచనాలు రూపొందించాలన్నారు. వడ్డేపల్లి బండ్ పటిష్టత గురించి ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాకరాశికుంటపై నుంచి వచ్చే వరద నీరు పోతన నగర్ మీదుగా వెళ్లడానికి కన్సల్టెంట్‌ను నియమించి, డిజైన్ చేయించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని నాలాల లెవల్స్ సమానంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. మ్యూజికల్ గార్డెన్‌పై నుంచి వచ్చే నాలా వెడల్పు చేసేలా డీపీఆర్ రూపొందించాలని, నాలాపై ఆక్రమణలు తొలగించి, తాత్కాలికంగా కచ్చా నాలా ద్వారా వరద నీరు వెళ్లేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బల్దియా ఎస్ఈ కృష్ణారావు, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనివాసరావు, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఈఈలు రాజయ్య, బీఎల్ శ్రీనివాసరావు, సంజయ్‌కుమార్, శ్రీనివాస్, పబ్లిక్ హెల్త్ ఈఈ రాజ్‌కుమార్, డీఈఈలు రవికుమార్, సంతోష్‌బాబు, అజ్మీరా శ్రీకాంత్, ఏఈలు పాల్గొన్నారు.

దాడి కేసులో ఎస్సై అత్యుత్సాహం

నయీంనగర్, జూలై 9 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని గోపాల్‌పూర్ కల్లుమండువ వద్ద జరిగిన గొడవ కేసులో ఎస్సై అత్యుత్సాహం చూపుతున్నాడని బాధితులు ఆరోపించారు. ఇక్కడ బెల్టుషాపు నిర్వహిస్తున్న అదే ప్రాంతానికి చెందిన వ్యక్తి ఇటీవల అతిగా మద్యం సేవించి ఓ వ్యక్తిని రక్తం వచ్చేలా కర్రలు, కత్తులతో దాడి చేశాడు. దీనిపై సీసీ ఫుటేజీలతో సహా బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే, నిందితుడిపై స్థానిక ఎస్సై తూతూ మంత్రంగా కేసు నమోదు చేసినట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. దాడి తీవ్రతను బట్టి కేసు నమోదు చేయాలని ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాడి చేసిన వ్యక్తిని ఇప్పటి వరకూ స్టేషన్‌కు తీసుకురాలేదని, అతడు దర్జాగా బయట తిరుగుతున్నాడని చెబుతున్నారు. ఈ విషయంపై సదరు ఎస్సైను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా స్పందించ లేదు. సీఐను సంప్రదించగా నిందితుడిని తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, మెడికల్ రిపోర్టు రాగానే తీవ్రతను బట్టి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బంజారాహిల్స్-2 శాఖ (11051):
#1 రిలయన్స్ క్లాసిక్ బిఎల్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్, తెలంగాణ-500034,
ఇమెయిల్: ubin0811050@unionbankofindia.bank

(రూల్-8(1)) స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

దిగువ సంతకందారు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బంజారాహిల్స్-2 శాఖ** యొక్క అధీకృత అధికారిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (సెకండ్) యాక్ట్, 2002 (యాక్ట్ 54 ఆఫ్ 2002) క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువబడు సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి సదరు నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజుల్లోగా నోటీసులో తెలిపిన మొత్తం **రూ. 1,05,58,459.11 (ఒక కోటి ఐదు లక్షల యాభై ఎనిమిది వేల నాలుగు వందల యాభై తొమ్మిది రూపాయల పదకొండు పైసలు మాత్రమే)**లను తిరిగి చెల్లించవలసిందిగా **రుణగ్రహీత మెసర్స్ హరిణి ట్రేడింగ్ కంపెనీ (ఖాతా: 110515010000005, ప్రాతినిధ్యం వహించువారు 1. శ్రీ పాశం చెన్నారెడ్డి తండ్రి శ్రీ పాశం జమలా రెడ్డి (మేనేజింగ్ పార్టనర్), 2. శ్రీ బుజుగుండ్ల రాజేంద్ర కుమార్ తండ్రి శ్రీ మహదేవ్ బుజుగుండ్ల (పార్టనర్) మరియు 3. శ్రీ బుజుగుండ్ల రవీందర్ కుమార్ తండ్రి మహదేవ్ బుజుగుండ్ల (గ్యారంటార్)** వారిని కోరుతూ 27-03-2024 తేదీగల డిమాండ్ నోటీసు (పత్రికా ప్రచురణ తేదీ: 24.04.2024) జారీచేశారు.
రుణగ్రహీత సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలం కావడంచేత సదరు రూల్స్‌లోని రూల్ 8తో చదువబడు సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాల్ని వినియోగించి దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు **05 జూలై, 2024న** స్వాధీనం చేసుకున్నారని రుణగ్రహీతకు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.
సదరు ఆస్తితో ఏ విధమైన లావాదేవి జరుపరాదని మరియు సదరు ఆస్తితో జరుపు ఏవేని లావాదేవీలు **రూ. 1,05,58,459.11 (ఒక కోటి ఐదు లక్షల యాభై ఎనిమిది వేల నాలుగు వందల యాభై తొమ్మిది రూపాయల పదకొండు పైసలు మాత్రమే)** మరియు దానిపై వడ్డీ కలిపి సదరు మొత్తం కొరకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బంజారాహిల్స్-2 శాఖ** యొక్క చార్జ్‌కి లోబడి వుంటాయని ప్రత్యేకించి రుణగ్రహీతను మరియు సాధారణ ప్రజానీకాన్ని ఇందుమూలంగా హెచ్చరించడమైనది.
సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు అందుబాటులో గల సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13లోని సబ్-సెక్షన్(8)లోని నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతలకు తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరణ

శ్రీ బుజుగుండ్ల రాజేంద్ర కుమార్ తండ్రి మహదేవ్ బుజుగుండ్ల మరియు శ్రీ బుజుగుండ్ల రవీందర్ కుమార్ తండ్రి మహదేవ్ బుజుగుండ్లకు చెందిన, రెడ్డి కాలనీ, హనుమకొండ, వరంగల్, తెలంగాణ-506001 వద్ద గల, మున్సిపల్ నెం.3/704 మరియు 3/705 (పాతది) 3-10-31 (కొత్తది) కలిగిన ఇల్లు, 355.00 చ.గజాలు లేదా 297.28 చ.మీటర్లు విస్తీర్ణం మొత్తంతో కలిపి నిర్మించబడిన నివాస ఇల్లు యావత్తు, సరిహద్దులు: ఉత్తరం: కె.దశరథం ఇల్లు, దక్షిణం: పి.ఎల్లయ్య ఇల్లు, తూర్పు: మున్సిపల్ లేన్, పడమర: మున్సిపల్ రోడ్.

తేది: 05-07-2024 సం/- అధీకృత అధికారి,
ప్రదేశం: వరంగల్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బదిలీలకు ముమ్మర కసరత్తు

- జిల్లాలో సీనియార్టీ జాబితా సిద్ధం
- పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు
- 12 వరకు ఆప్షన్ల స్వీకరణ
- 20లోగా బదిలీల ప్రక్రియ పూర్తి

హనుమకొండ, జూలై 9 : హనుమకొండ జిల్లాలో ఎవ్వరిని కదిలించినా ఇప్పుడు బదిలీల ముచ్చటే వినిపిస్తున్నది. ఎంత మంది సీనియర్లు ఉన్నారు.. ఎవరు ఎక్కడికి బదిలీ అయ్యే అవకాశం ఉంది.. అనే అంశాలపై జోరు గా ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఉద్యోగులు తమకు ఉన్న అవకాశాలను అన్వేషిస్తున్నారు. ఈ నెల 20లోగా బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని, అందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఆయా శాఖలు, కలెక్టర్ కార్యాచరణలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ప్రభుత్వ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీల ప్రక్రియ ముగిసింది. ప్రభుత్వం బదిలీలపై నిషేధం ఎత్తివేయడంతో మిగిలిన ప్రభుత్వ శాఖల్లో సందడి మొదలైంది. దీంతో దీర్ఘకాలికంగా ఒకే చోట తిష్ట వేసిన వారందరూ ఈ సారి తప్పకుండా స్థానచలనం చేయాల్సి వస్తుంది. త్వరలో విరమణ పొందేవారు, స్పౌజ్ కేసులు, మానసిక వైకల్యం ఉన్న పిల్లల తల్లిదండ్రులు, వైద్యపరమైన ఇబ్బందులు ఉండే వారికి కొంత మినహాయింపు ఉండే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ నిబంధనల మేరకు గరిష్టంగా 40 శాతం మించకుండా బదిలీలు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ అంతా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కలెక్టర్ పర్యవేక్షణలో కసరత్తు జరుగుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 20లోగా బదిలీల ప్రక్రియను పూర్తి చేసి, 21వ తేదీ నుంచి మళ్లీ బదిలీలను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

సిద్ధమైన సీనియార్టీ జాబితా

హనుమకొండ జిల్లాలో బదిలీల ప్రక్రియకు సంబంధించి చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆయా శాఖల అధికారుల ఆధ్వర్యంలో ఇప్పటికే సీనియార్టీ జాబితాను సిద్ధం చేశారు. ఆయా శాఖల్లో నాలుగేళ్లు దాటిన వారితోపాటు రెండు, మూడేళ్లు దాటిన వారి వివరాలను సేకరించారు. ఈ జాబితాను జిల్లా స్థాయి పోస్టులకు సంబంధించి కలెక్టర్‌కు, జోనల్ స్థాయి పోస్టులకు సంబంధించి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు పంపించారు. జిల్లా స్థాయిలోని జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు, రికార్డు అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్, నైట్ వాచ్‌మన్ పోస్టులకు సంబంధించి కలెక్టర్ బదిలీ చేస్తారు. ఇందుకు కలెక్టర్ చైర్మన్‌గా, ఆ శాఖ హెడ్ కన్వీనర్‌గా, అదనపు కలెక్టర్/ డీఆర్‌వో సభ్యులుగా కమిటీ ఏర్పడి, ఉద్యోగులు ఇచ్చిన ఆప్షన్లను పరిశీలించి బదిలీలు చేస్తారు. అలాగే, సీనియర్ అసిస్టెంట్ నుంచి మొదలుకొని ఆపై అన్ని పోస్టులకు సంబంధించి (జోనల్ స్థాయి పోస్టులు) రాష్ట్ర స్థాయిలో బదిలీల ప్రక్రియను చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. అయితే, ఉద్యోగులు మంగళవారం నుంచి 12 వరకు ఐదు ఆప్షన్ల చొప్పున ఇవ్వాల్సి ఉంటుంది. ఇచ్చిన ఆప్షన్ల ఆధారంగా బదిలీలు జరుగుతాయి.

పైరవీల బాటలో ఉద్యోగులు

జిల్లాలో బదిలీల కసరత్తు నడుస్తుండగానే కొందరు ఉద్యోగులు పైరవీల బాట పట్టారు. జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకొనేందుకు వారి వద్దకు వెళ్లి ప్రాధేయపడుతున్నట్లు సమాచారం. తమకు అనుకూలంగా ఉండే స్థానాల కోసం పాకులాడుతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. అయితే, కలెక్టర్లు మాత్రం పారదర్శకతకే అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. బదిలీల ప్రక్రియలో కలెక్టర్లపై రాజకీయ ఒత్తిళ్లు కూడా ఉండే అవకాశం లేకపోలేదని పలువురు ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. అయితే, కొందరు ఉద్యోగులు మాత్రం ఎక్కడికి బదిలీ చేసినా వెళ్తామని అంటుండగా మరికొంత మంది మాత్రం తమకు అనుకూలమైన స్థానాల కోసం పైరవీలు చేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

కురుకుల్లా మాతగా భద్రకాళి

నాలుగో రోజూ శాకంబరీ ఉత్సవాలు

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వరంగల్, జూలై 9 : భద్రాకాళీ శాకంబరీ నవరాత్రి మహోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. నాలుగో రోజు మంగళవారం ఉదయం భద్రకాళీ అమ్మవారు కురుకుల్లా మాతా అలంకరణ, సాయంత్రం భేరుండా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

గాజులతో పద్మాక్షికి ప్రత్యేక అలంకరణ

హనుమకొండ : హనుమకొండ పద్మాక్షి దేవాలయంలో శాకంబరీ ఉత్సవాలు కొనసాగుతున్నాయి. నాలుగో రోజు మంగళవారం అర్చకులు నాగిళ్ల శంకర్‌శర్మ, షణ్ముఖశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సప్తవర్ణాత్మకమైన 10,008 గాజులు, వివిధ రకాల పూలు, కూరగాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ఎల్కతుర్తి/వేలేరు, జూలై 9 : ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్లకు మంగళవారం బీజేపీ నాయకులు వినతిపత్రాలు సమర్పించారు. రూ.2లక్షల రుణమాఫీతో పాటు రైతుభరోసా ఇచ్చి, రాష్ట్రంలో ప్రధానమంత్రి పంటల బీమా యోజన అమలు చేయాలని పేర్కొన్నారు. ఎల్కతుర్తిలో కిసాన్‌మోర్చా నాయకులు గట్టు రాజమొగిలి, వై రాజు, బీట్ల లింగయ్య, ప్రభాకర్, ముషికె వెంకటేశ్‌యాదవ్, మధుకర్, కనకయ్య, శ్రీవర్ధన్, పెరుగు మధు, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. వేలేరులో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి తక్కళ్లపల్లి అమృతరావు, కార్యదర్శి రాజేశ్, మండల అధ్యక్షుడు కాట్రెవుల రాజు, నాయకులు దుస్స రాములు, బండి రాజు, బత్తిని సాంబరాజు, రాజు, కనకాచారి పాల్గొన్నారు.

కిట్స్‌లో ఫ్యాకల్టీ ఇండక్షన్ ప్రోగ్రాం

హసన్‌పర్తి, జూలై 9 : ఎర్రగట్టుగుట్ట సమీపంలోని కిట్స్ కళాశాలలో ఫ్యాకల్టీ ఇండక్షన్ ప్రోగ్రాంను మంగళవారం ప్రారంభించారు. ఈ నెల 13 వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో కిట్స్‌లో చేరిన అధ్యాపకులకు నూతన పద్ధతులపై అవగాహన కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అశోక్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు కోమల్‌రెడ్డి, వేణుమాధవ్, ప్రభాకరాచారి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ చోరీ

కమలాపూర్, జూలై 9 : మండలంలోని శంభునిపల్లి గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ వైర్ చోరీకి గురైనట్లు ఎన్పీడీసీఎల్ ఉప్పల్ ఏఈ సంపత్‌రెడ్డి మంగళవారం తెలిపారు. గ్రామ శివారులోని వర్ద ముత్తారెడ్డి పొలం సమీపంలో ఉన్న 25 కేవీ కెపాసిటీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు పగులకొట్టి అందులోని కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఏఈ వెల్లడించారు.

'నిరుద్యోగుల అరెస్టులను ఖండిస్తున్నాం'

హనుమకొండ చౌరస్తా జూలై 9 : కొన్నిరోజులుగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, రెండు లక్షల ఉద్యోగాల హామీ, మెగా డీఎస్సీ, గ్రూప్- 2, 3 పోస్టుల పెంపు తదితర అంశాలపై పోరాటం చేస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు, నిరుద్యోగుల అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్‌ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీపీఎస్సీ పరీక్షలు, డీఎస్సీకి 90 రోజుల సమయం కావాలనేది న్యాయమైన డిమాండ్ అని పేర్కొన్నారు. విద్యార్థుల నిరసనను అణచివేసేందుకు పోలీసులు ఓయూ లైబ్రరీ, యూనివర్సిటీ ఆవరణలో నిరుద్యోగులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చమంటే అక్రమంగా అరెస్టులు చేస్తూ ప్రజాస్వామ్యాని విఘాతం కలిగిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకూ తాము విద్యార్థులు, నిరుద్యోగ అభ్యర్థుల పక్షాన పోరాడుతామని తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 26 మందికి జరిమానా

సుబేదారి, జూలై 9: హనుమకొండ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 26 మందిని పట్టుకొని రూ.45,600 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షుకూర్ తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఆరుగురికి రూ.4వేల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు : సీపీ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ

సుబేదారి, జూలై 9: యువత మత్తుకు బానిస కావొద్దని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా పిలుపునిచ్చారు. ఆచార్య రవి రూపొందించిన 'మత్తుకు యువత దూరంగా ఉండాలి' అనే పోస్టర్‌ను మంగళవారం తన కార్యాలయంలో సీపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు.

హనుమకొండ డీఈవోగా వాసంతి

హనుమకొండ చౌరస్తా, జూలై 9 : హనుమకొండ డీఈవోగా వాసంతి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కే లింగయ్య ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో డీఈవోగా పనిచేసిన అబ్దుల్‌హై అనారోగ్యంతో సెలవుపై వెళ్లారు. ఈ క్రమంలో డీఈవోగా వాసంతికి బాధ్యతలు అప్పగించినట్లు పేర్కొన్నారు.

వెంకట్రామిరెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

కలెక్టర్‌కు బొకే అందజేస్తున్న కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి

కుడా చైర్మన్‌ను కలిసిన పీఏసీఎస్ చైర్మన్

ఆత్మకూరు, జూలై 9 : కుడా చైర్మన్‌గా ఇనుగాల వెంకట్రామిరెడ్డి బాధ్యతలు తీసుకున్న సందర్భంగా మంగళవారం ఆత్మకూరు పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ మర్యాద పూర్వకంగా ఆయనను కలిశారు. వెంకట్రామిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, మాజీ సర్పంచ్‌లు నాగెల్లి సామ్యేల్, బూర రాజేందర్, మైనార్టీ రాష్ట్ర నాయకులు ఎండీ గౌస్, ఆత్మకూరు పార్టీ ప్రధాన కార్యదర్శి అలువాల రవి ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కుడా చైర్మన్

హనుమకొండ : కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఇనుగాల వెంకట్రామిరెడ్డి మంగళవారం కలెక్టర్ పీ ప్రావీణ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో ఆమెకు పుష్పగుచ్ఛం అందజేశారు. కాగా, కుడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకట్రామిరెడ్డికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.

బైపాస్ వేయక ముందే రోడ్డును తవ్వేశారు..

పున్నేల్ క్రాస్ వద్ద స్తంభించిన ట్రాఫిక్

ఐనవోలు, జూలై 9 : కొత్త నిర్మాణ పనులు జరుగుతున్నాయని సంబురపడాలా..? లేక అవే పనులతో ప్రయాణం నిత్యం ఇబ్బందిగా మారిందని బాధపడాలో అర్థం కాని పరిస్థితి ఐనవోలుకు వచ్చిపోయే ప్రయాణికుల్లో నెలకొంది. మండలంలోని పున్నేల్ క్రాస్ వద్ద ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయం ఆర్చి నిర్మాణ పనులు ఇటీవల ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఉన్న ఆర్చి చిన్నగా ఉండడంతో భారీ వాహనాలు వస్తే

ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు దాతల సాయం తో నూతన ఆర్చి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయితే, ఈ నిర్మాణ పనులు చేస్తు న్న కాంట్రాక్టర్ అవగాహన లోపంతో పనులు ప్రారంభం కాకముందే ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బైపాస్ రోడ్డు వేయకుండానే ఉన్న రోడ్డును తవ్వడంతో ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. అసలే వర్షకాలం కావడం, ఖమ్మం ప్రధాన రహదారికి ఆనుకుని ఉండడంతో ఆర్చి పక్కన నుంచి ప్రయాణం చేస్తున్న భారీ వాహనాలు రోజు ఒక్కటైనా ఇక్కడ దిగబడుతున్నాయి. దీంతో ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, పున్నేల్ క్రాస్ ఆర్చి పక్కన పటిష్టమైన బైపాస్ రోడ్డు వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి

హనుమకొండ చౌరస్తా, జూలై 9 : విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేస్తే తప్పక విజయం వరిస్తుందని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీ మల్లారెడ్డి అన్నారు. విశ్వవిద్యాలయ ఫార్మసీ కాలేజీ సెమినార్ హాల్‌లో మంగళవారం క్యాంపస్ ఫార్మసీ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ పాల్గొని ప్రసంగించారు. అధ్యాపకులు వై నరసింహారెడ్డి, జే కృష్ణవేణి, స్వరూపారాణి, బీ నాగరాజు, సహాయ రిజిస్ట్రార్ కోలా శంకర్ పాల్గొన్నారు.

రేపు క్రికెట్ జట్టు ఎంపికలు

హనుమకొండ చౌరస్తా, జూలై 9 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల రెండో వారం నుంచి హైదరాబాద్ నగరంలో జరగనున్న లీగ్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు గురువారం దేశాయిపేటలోని సీకేఎం కాలేజీ మైదానంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు వరంగల్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. 25 ఏళ్లలోపు వయసు ఉన్న ఆసక్తి గల క్రికెట్ క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్ కార్డుతో సొంత క్రికెట్ కిట్, యూనిఫామ్‌తో హాజరు కావాలని కోరారు.

1 నుంచి స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ

హనుమకొండ చౌరస్తా, జూలై 9 : విద్యార్థులు నుంచి వచ్చిన అభ్యర్థనలు, సెమిస్టర్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో బుధవారం నుంచి జరుగాల్సిన స్పోకెన్ ఇంగ్లిష్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్ శిక్షణను ఆగస్టు 1 నుంచి ప్రారంభించనున్నట్లు కేయూ సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్(సెల్ట్) సంచాలకుడు డాక్టర్ ఆర్ మేఘనారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల కేయూ విద్యార్థులు రూ.1000, ఇతరులు రూ.1500 జూలై 31వ తేదీ లోపు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సివిల్స్ శిక్షణకు నేటితో ఆఖరు

హనుమకొండ చౌరస్తా, జూలై 9 : రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అధ్యయన కేంద్రం ద్వారా యూపీఎస్సీ, సివిల్ సర్వీస్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (సీఎస్‌ఏటీ) కోసం అందించే ఉచిత శిక్షణకు బుధవారం చివరి గడువు అని, అర్హులైన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని అధ్యయన కేంద్రం ఉమ్మడి వరంగల్ జిల్లా డైరెక్టర్ డాక్టర్ కొంగర జగన్‌మోహన్ తెలిపారు. డిగ్రీ ఉత్తీర్ణులై వార్షిక ఆదాయం రూ.3లక్షలు మించకుండా ఉన్నవారు http://tsstudycircle.co.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 21న ఎంపిక పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మెరిట్ ఆధారంగా ప్రవేశం కల్పించి, ఉచిత వసతి భోజనంతో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు.

14న సాహిత్య సంగీత సమ్మేళనం

హనుమకొండ, జూలై 9 : తెలంగాణ రాష్ట్ర కవుల సంక్షేమ సమాఖ్య, ఏకశిల కరోకే క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏడో సాహిత్య సంగీత సమ్మేళనాన్ని(కవితలు అండ్ కరోకే పాటలు) ఈ నెల 14న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. హనుమకొండ పద్మాక్షికాలనీలోని డాక్టర్ జగదీశ్‌బాబు కళా నిలయం(జయకృష్ణ దవాఖాన)లో సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

రూ.1.30కోట్ల గంజాయి దహనం

సుబేదారి, జూలై 9 : పోలీసు కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో స్మగ్లర్ల నుంచి స్వాధీనం చేసుకున్న రూ.1.30కోట్ల విలువైన గంజాయిని పోలీసులు దహనం చేశారు. తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో విభాగం ఆదేశాల మేరకు వరంగల్ పోలీసు కమిషనరేట్ డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నగర శివారు అమ్మవారిపేటలో ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, అదనపు డీసీపీ రవి ఆధ్వర్యంలో దహనం చేశారు. కార్యక్రమంలో హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, ఎనుమాముల ఎస్సై నరసింహారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు

హనుమకొండ, జూలై 9 : మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను మంగళవారం బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో నిర్వహించారు. సీతక్క ఉద్యమ సహచరులు కంకణాల విజయ, సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి బీ సదయ్య ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి విద్యార్థులకు అన్నదానం చేశారు. టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా ఉపాధ్యక్షుడు సాయిరాం, మాజీ సర్పంచ్ కుమారస్వామి, జక్కుల రాజూ యాదవ్, కుటుంబ సభ్యులు కృష్ణప్రసన్న, సృజన, చిన్నారి తక్షి, కంకణాల శ్రీజిత, మానిని, కేంద్రం నిర్వాహకురాలు రామలీల పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యోగా గురువు రవీంద్రాచారి

నేటి నుంచి యోగా శిబిరం

హనుమకొండ చౌరస్తా, జూలై 9 : నిత్య యోగా సాధన వల్ల మనిషి శారీరక మానసిక రుగ్మతల నుంచి విముక్తి పొందుతాడని, దీర్ఘకాలిక వ్యాధులు నయం చేసుకోవచ్చని యోగా గురువు ఆర్ రవీంద్రాచారి అన్నారు. మంగళవారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హనుమకొండ, కాజీపేట ప్రజల కోసం కేఎల్‌రెడ్డికాలనీలోని శ్రీరామకృష్ణ సేవా సమితి వేదికగా బుధవారం నుంచి రోజు శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 7-8 వరకు మొదటి బ్యాచ్, సాయంత్రం 6-7 గంటల వరకు రెండో బ్యాచ్ ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. వివరాలకు 98484 50493, 73066 11440, 93926 15133 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఐనవోలు, జూలై 9 : మండల కేంద్రానికి చెందిన శ్రీసాయి పరపతి సంఘం సీనియర్ సభ్యుడు గడ్డం రాజు ఇటీవల మృతిచెందగా సంఘం పాలకవర్గం, సభ్యులు మంగళవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, సంఘం నుంచి రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బొల్లెపల్లి ప్రదీప్, ఉపాధ్యక్షుడు గడ్డం రమేశ్, ప్రధాన కార్యదర్శి గడ్డం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం

- అభివృద్ధి పనుల నిలిపివేత తగదు
- పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

దామెర, జూలై 9 : ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరంతరం పోరాటం చేస్తామని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ఇటీవల పదవీ విరమణ పొందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లను మంగళవారం దామెర మండల కేంద్రంలోని ఏఎన్‌ఆర్ గార్డెన్స్‌లో శాలువా, పుష్పగుచ్ఛాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో పరకాల నియోజకవర్గంలో రాజకీయాలకతీతంగా అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. ఏనాడూ ఇతర పార్టీల కార్యకర్తలు, నాయకులపై కక్ష్యసాధింపు చర్యలకు దిగలేదన్నారు. సింగరాజుపల్లి-హరిచంద్రనాయక్ తండా వరకు బీటీ రోడ్డు, ఆరెపల్లి క్రాస్ నుంచి పరకాల వరకు డబుల్ బీటీ రోడ్డు గత ప్రభుత్వంలో మంజూరైనా ఇప్పటి వరకూ పనులు నడవడం లేదన్నారు. వీటిని ఎందుకు చేపట్టడం లేదో ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఇలా నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులను రద్దు చేశారని ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో రాజకీయాలకతీతంగా గ్రామాలను అన్నివిధాలుగా అభివృద్ధి చేశామని, సాగు, తాగునీటికి ఎలాంటి ఢోకాలేకుండా చూశామన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎప్పటికప్పుడు అందజేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తవుతున్నా ఇప్పటివరకు ప్రజలకు మౌలిక వసతులను కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అధికారం ఉన్నా లేకున్నా ప్రజాసేవ చేయడం కోసం ఎప్పటికప్పుడు స్పందించాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు ఆయన సూచించారు. మాజీ ఎంపీపీ కాగితాల శంకర్, మాజీ వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, మాజీ జడ్పీటీసీ కల్పనా కృష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీలు పోలం కృపాకర్‌రెడ్డి, గండు రాము, గోవిందు అశోక్, మౌనికాకిరణ్, మాజీ సర్పంచ్‌లు మేడిపల్లి సాంబయ్య, పున్నం రజితాసంపత్, రజితాసత్యం, పుల్యాల రాణీరఘుపతిరెడ్డి, తుత్తురు శ్రీనివాస్, పీఏసీఎస్ డైరెక్టర్ దుబాసి అనిల్, ఏఎంసీ మాజీ చైర్మన్ కాంతాల కేశవరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి, బీఆర్‌ఎస్ నాయకులు ముదిగొండ కృష్ణమూర్తి, దాడి మల్లయ్య, మెంతుల రాజు, కౌటం మోహన్, దుబాసి నవీన్, మాజీ సర్పంచ్ పాండవుల భిక్షపతి, గడ్డం సదానందం, వేల్పుల ప్రసాద్, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లను సన్మానిస్తున్న ధర్మారెడ్డి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565